



జొన్నగిరి వద్ద జియో మైసూర్ ఏర్పాటు చేసిన గోల్డ్ ప్రాజెక్టు

జొన్నగిరి వద్ద నిర్మాణంలో జియో మైసూర్ గోల్డ్ ప్రాజెక్టు యూనిట్

బంగారం వెలికితీసే యంత్రం

- రాయలసీమ రాళ్లసీమ కాదు.. బంగారు సీమ
- జొన్నగిరిలో గోల్డ్ మైన్ ప్రాజెక్టు ప్లాంట్ నిర్మాణం
- జియో మైసోర్ సంస్థ ఆధ్వర్యంలో బంగారు గని తవ్వకాలు
- ఈ ఏడాది ఆఖరిలోగా బంగారు ఉత్పిత్తికి సన్నాహాలు
- దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ ప్రాజెక్టు ఇదే..
- 200 మందికి పైగా ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి అవకాశాలు

స్వర్ణ సీమ..!

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి):

కేజీఎఫ్ అంటే గుర్తుకొచ్చేది కోలార్ గోల్డ్ ఫీల్డ్. కర్నూలు జిల్లాలోనూ అలాంటి గోల్డ్ ఫీల్డ్ ఒకటుంది. అదే 'జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్'. రాయలసీమ రాళ్లసీమ అనే నానుడి.. ఇకపై బంగారు సీమగా మారనుంది. ఎప్పటి నుంచో ఇక్కడ బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంటున్నారు. జియో మైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ పరిశోధనలు చేసి బంగారు నిక్షేపాలు ఉన్నాయని నిర్ధారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతో గోల్డ్ మైనింగ్‌కు శ్రీకారం చుట్టింది. రూ.200 కోట్లతో చేపట్టిన జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టు, ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు దాదాపు 65 శాతం పూర్తయినట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్)కి ఈ సంస్థలో వాటాలు ఉన్నాయి. జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టులో ఈ ఏడాది ఆఖరులోగా బంగారం వెలికితీత మొదలు కానున్నట్లు సమాచారం. లక్ష్యం ఏడాదికి 750 కిలోల బంగారు వెలికితీత. ప్రైవేటు రంగంలో దేశంలోనే తొలి గోల్డ్ మైన్ ఇదే కావడం ప్రత్యేకత.

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయని ఎప్పటి నుంచో అంటున్నారు. ఈ ప్రాంతంలో తొలికరి వర్షాలు కురిసే సమయంలో వజ్రాలు లభిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వజ్రాల అన్వేషణకు జనం వస్తుంటున్నారు. ఏటీ రూ.లక్షల విలువైన వజ్రాలు లభిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు 1994లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వే చేసి గుర్తించింది. గోల్డ్ మైనింగ్ రంగంలో విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. జొన్నగిరి కేంద్రంగా గోల్డ్ మైనింగ్ (బంగారు గని)కోసం 2005లో జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ దరఖాస్తు చేస్తే.. వివిధ కారణాలు వల్ల అనుమతులకు జాప్యం జరుగుతూ వచ్చింది. రాష్ట్ర విభజన తరువాత 2013లో గోల్డ్ మైనింగ్ కోసం జియో మైసూర్ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని రకాల అనుమతులు లభించడంతో.. 2014లో బంగారు గనుల తవ్వకాల కోసం ప్రణాళికలు తయారు చేసుకున్న ఆ సంస్థ 250 ఎకరాలు కొనుగోలు చేసింది. మరో 1,500 ఎకరాలు రైతుల నుంచి లీజుకు తీసుకొని ఎకరానికి ఏటా రూ.15 వేలు లీజులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. 250 ఎకరాల్లో మైనింగ్, డంప్‌యార్డు, గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్, వాటర్ రిజర్వాయర్ నిర్మాణాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్లాంట్ పనులు దాదాపుగా 65 శాతం పూర్తయినట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా గోల్డ్ ఉత్పత్తి ప్రక్రియ



దేశంలో తొలి ప్రైవేటు బంగారు గని

కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్)గా చరిత్ర సొంతం చేసుకున్న కోలార్ గోల్డ్ మైన్ స్వాతంత్ర్యానికి పూర్వం 1880లోనే ఆనాటి బ్రిటీష్ పాలనలో మొదలు పెట్టారు. ఆ తరువాత 1945లో రాయచూరు వద్ద హట్టి గోల్డ్ మైన్స్ ప్రారంభించారు. స్వాతంత్ర్యం తరువాత దేశంలో ఎక్కడా కూడా గోల్డ్ మైన్ చేపట్టలేదని అంటున్నారు. ప్రైవేటు రంగంలో తొలి గోల్డ్ ప్రాజెక్టుగా జొన్నగిరి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌ను జియో మైసూర్ సంస్థ నిర్మిస్తుండడం రాయలసీమకే ప్రత్యేక స్థానం దక్కుతుందని మైనింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. జొన్నగిరి పేరు గోల్డ్ మైనింగ్ చరిత్రకెక్కనుంది.

రూ.200 కోట్ల పెట్టుబడి..!

జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును జియో మైసూర్ సంస్థ రూ.200 కోట్లతో చేపడుతోంది. ఇప్పటికే సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరులోగా బంగారు ఉత్పత్తి చేపట్టే అవకాశాలు ఉన్నాయని ఆ సంస్థ డిప్యూటీ జీఎం హరికిరణ్ ఆలపాటి ఆంధ్రజ్యోతికి వివరించారు. జియో మైసోర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులో దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్)కు దాదాపు 40-49 శాతం వరకు వాటాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ గోల్డ్ ప్రాజెక్టు ఉత్పత్తి మొదలు పెడితే ప్రత్యేక్షంగా, పరోక్షంగా 200-250 మందికి పైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంటున్నారు.



పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గోల్డ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా గోల్డ్ ఉత్పత్తి ప్రక్రియ

టార్గెట్.. ఏటా 750 కిలోల బంగారు వెలికితీత

ఏడాదికి 750 కిలోల బంగారు వెలికితీత లక్ష్యంగా జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ, దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎల్ఎల్) జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటికే బంగారు నిక్షేపాల తవ్వకాలు, ప్రాసెసింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. లీజులకు తీసుకున్న భూముల్లో ప్రతి 20 మీటర్లకు ఒక డ్రిల్లింగ్ తవ్వి గోల్డ్ మైన్ నాణ్యత, లభనష్టాలపై అంచనా వేసేందుకు పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన ఆ సంస్థ సత్ఫలితాలు రావడంతో పూర్తిస్థాయి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పనులు కూడా దాదాపుగా 65 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి బంగారు ఉత్పత్తి మొదలు కానుంది. ఇక్కడే కాదు.. రాష్ట్రంలో చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలు గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ జిల్లాల్లో గోల్డ్ మైనింగ్ ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ఆసక్తి చూపుతోంది. ఏదిఏమైనా రాళ్లసీమగా ప్రసిద్ధి చెందిన రాయలసీమ జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు రాకతో 'స్వర్ణసీమ'గా మారనుంది. ఈ ప్రాజెక్టు వల్ల కరువు పల్లెసీమల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి వలసలు ఆగుతాయని పలువురు పేర్కొంటున్నారు.

నాటి సువర్ణగిరి.. నేటి జొన్నగిరి

ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని సువర్ణగిరిగా పిలిచేవారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడి భూముల్లో బంగారు నిక్షేపాలు ఉన్నాయని ఆనాడే గుర్తించారేమో..! అందుకే సువర్ణగిరి అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. కాలక్రమేనా సువర్ణగిరి కాస్తా.. సొన్నగిరిగా.. ఆ తరువాత జొన్నగిరి రూపాంతరం చెందింది. అంతేకాదు జొన్నగిరి ఒక గ్రామం మాత్రమే కాదు.. అశోకుడి కాలంలో అశోక సామ్రాజ్యానికి దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయంగా ఉండేదని అంటున్నారు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెందిన అశోకుడి శిలా శాసనాలు కూడా జొన్నగిరికి సమీపంలో గుర్తించారు. ఆలయానికి సమీపంలో భారీ రాతిబావి ఉంది. ఆనాడే బంగారు నిక్షేపాలు వెలికితీసేందుకు ఈ బావి తవ్వి ఉండవచ్చని చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. చోళుల కాలంలో కూడా జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు స్వాధీనం చేసుకున్నారని చరిత్ర చెబుతోంది. బ్రిటీష్ కాలంలో కూడా బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ చేసినట్లు తెలుస్తుంది. 1991-94 మధ్య జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వేలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించడం, గోల్డ్ మైనింగ్ కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ అన్ని రకాల అనుమతులు సాధించింది. దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడితో జొన్నగిరి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ పనులు చేపట్టడంతో జొన్నగిరికి మళ్లీ నాటి సువర్ణగిరి పేరుతో ఖ్యాతికెక్కనుంది.

ఓటమిని గ్రహించే వైసీపీ దాడులు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి తదితరులు

కర్నూలు(అర్బన్), మే 16: ఓడిపోతున్నామని గ్రహించే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ వైసీపీ వరుస దాడులకు పాల్పడుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మరోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారని ఆయన వెల్లడించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేఈ కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకత్వంలోని ఎన్డీయే విజయం సాధించడం ఖాయమన్నారు. 2019లో మోసపూరిత వాగ్దానాలిచ్చి, ఒక్క అవకాశమంటూ ప్రజలను బతిమాలి జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యారన్నారు. తర్వాత రాష్ట్రాన్ని ఆయన అన్నివిధాలుగా నాశనం చేశాడని ఆరోపించారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. అందుకే ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓపిగ్గా టీడీపీకి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రాన్ని జగన్ బారి నుంచి కాపాడుకునేందుకు లక్షల మంది సుదూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగల శక్తి సామర్థ్యాలు ఒక్క చంద్రబాబు నాయుడుకే ఉన్నాయని అన్నారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ పరిపాలన అనుభవంతో రాష్ట్రాన్ని బాగుచేస్తారని ప్రజలు విశ్వసించారన్నారు. ఓటమి భయంతోనే ఎన్నికలు పూర్తి అయిన తర్వాత కూడా వైసీపీ మూకలు టీడీపీ శ్రేణులు, సానుభూతిపరులపైన దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. ఓటమి ఖాయమని గ్రహించే వైసీపీ ఇలాంటి దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు వై .నాగేశ్వరరావు యాదవ్, ఆకెపోగు ప్రభాకర్, కే.ఈ.జగదీష్, ప్రసాద్, నాగరాజు యాదవ్, సత్రం రామకృష్ణుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఏపీఈఏపీసెట్





జి.పుల్లారెడ్డి, పుల్లయ్య కళాశాలల్లో ఏపీఈఏపీసెట్ రాసేందుకు క్యూలో వెళుతున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 16: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీఫార్మసీ ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్టు గురువారం ప్రారంభమైంది. ఏపీఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతాయి. గురువారం అగ్రికల్చర్, బీ-ఫార్మసీ కోర్సులకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కన్వీనర్ నిర్వహించిన సమయం కంటే విద్యార్థులు గంట ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు తల్లిదండ్రులు, బంధువులతో కలిసి చేరుకోవడంతో రద్దీగా కనిపించింది. గురువారం ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కర్నూలులో 6, ఎమ్మిగనూరు, ఆదోనిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మొత్తం ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ-ఫార్మసీ కోర్సులకు సంబంధించి మొత్తం అభ్యర్థులు 19,606 మంది నమోదు చేసుకున్నారు. ఒక్క నిమిషం నిబంధనతో విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. కొన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెల్‌ఫోన్లు నిల్వ చేసుకోవడానికి లాకర్స్‌ను పరీక్ష నిర్వాహకులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మొదటి రోజు అగ్రికల్చర్, బీ ఫార్మసీ కోర్సుల ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అగ్రికల్చర్, బీ-ఫార్మసీ విభాగాలకు చెందిన మొత్తం అభ్యర్థులు 8,248 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో మొదటి రోజు 3,675 మందికి గాను 3,419 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 156 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 93.03 శాతం హాజరు నమోదైంది.

కూటమి విజయం ఖాయం

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్


ఓర్వకల్లు, మే 16: ఉమ్మడి నంద్యాల, కర్నూలు నియోజకవర్గాల్లో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీ స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధించడం ఖాయమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన హుశేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్లందరూ ఓపిగ్గా ఓటు వేసి మార్పు దిశగా అడుగులు వేశారన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకోవడంతో 14 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందన్నారు. ప్రతి గ్రామం నుంచి పట్టణం వరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు శాయశక్తులా కృషి చేశారన్నారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. ప్రజలందరూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ చంద్రబాబును సీఎం చేయాలనే తపనతో ఓటు వేయడానికి భారీగా తరలివచ్చారని తెలిపారు. ఓటమి తప్పదని భావించి, రాష్ట్రంలో అక్కడక్కడా టీడీపీ వర్గీయులపై వైసీపీ వాళ్లు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, నాగరాజు, బజారు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

తొలకరి పలకరింపు

- మండలంలో మొదలైన వేసవి దుక్కులు
- ఆదిలోనే 8 సెం.మీల వర్షం..
- ఆనందంలో అన్నదాతలు



మద్దికెర, మే 16: ఎండలు మండిపోతోంటే సేదతీర్చేలా తొలకరి వానలు మొదలయ్యాయి. వేసవి తాపం తీరి ప్రకృతి అంతా చల్లబడింది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో 3 సెం.మీల వర్షపాతం నమోదైతే.. ఈ ఏడాది ఆదిలోనే 8 సెం.మీల వర్షం పడింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు ఈ ఖరీఫ్ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. 22,500 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఖరీఫ్‌లో 7,500 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయగా.. ఈ ప్రాంతంలో వేరుశనగ పంటలను ఎక్కువ శాతం సాగు చేస్తారు. పొలాల్లో వేసవి దుక్కులు దున్నుకోవడం వల్ల నేలల్లో వర్షం నీరు ఇంకిపోయి అక్కడిక్కడే నీరు ఇంకిపోతుంది. భూసారాన్ని కూడా కాపాడుకోవచ్చు. వేసవిలో దున్నడం వల్ల నేల పొరల్లో ఉన్న క్రిములు, కీటకాలు దశలోనే బయటపడటంతో కలుపు విత్తనాలు కూడా నశిస్తాయి. దుక్కులు చేసుకోవడం వల్ల జూన్‌లో కురిసే వర్షాలకు పంటలు సాగు చేసుకోవడం సులభమవుతుంది. వేసవిలో దుక్కులను దున్నుకోవడం వల్ల పంట భూములకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయాధికారి రవి అన్నారు. భూమిలో తేమ శాతం పెరుగుతుందని అన్నారు.



హైపర్ టెన్షన్

సైలెంట్ కిల్లర్

● జీవన శైలి మార్పులతో అదుపు ● నేడు ప్రపంచ రక్తపోటు దినం

కర్నూలు(హాస్పిటల్), మే 16: హైపర్‌టెన్షన్ అంటే అధిక రక్తపోటు సమస్య. ప్రపంచ వ్యాప్తంగా హైపర్‌టెన్షన్ గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే 17న ఈ దినాన్ని జరుపుకుంటారు. హైపర్‌టెన్షన్‌ను సైలెంట్ కిల్లర్ అని అంటారు. రక్తనాళాలలో పీడనం చాలా ఎక్కువ ఉన్నప్పుడు (140/90 లేదా అంతకంటే ఎక్కువ) అధిక రక్తపోటు కింద లెక్కిస్తారు.

లక్షణాలు

- తలనొప్పి: తరచుగా తలనొప్పి అధిక రక్తపోటు రావడానికి ప్రారంభ హెచ్చరిక.
- దృష్టిలో సమస్యలు: దీర్ఘకాలికంగా బీపీ ఉంటే కళ్లలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అధిక రక్తపోటు రెటీనాకు నష్టం కలిగిస్తుంది. దీనిని రెటినోపతి అంటారు.
- శ్వాస ఆడకపోవడం: అ.ధిక రక్తపోటు గుండెపై ఒత్తిడికి దారి తీస్తుంది. గుండెకు రక్తం సరిగ్గా సరఫరా కాక శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది.
- అలసట: తీవ్రమైన అలసట అధిక రక్తపోటుకు సంకేతం. రక్తపోటు రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేసేందుకు గుండె కష్టపడాల్సి వస్తుంది. దీని వల్ల మెదడు ఇతర ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్, పోషక సరఫరాను తగ్గిస్తుంది.
- కిడ్నీల పనితీరు తగ్గడం : అధిక రక్తపోటు వల్ల కిడ్నీల పనితీరును నిశ్శబ్దంగా దెబ్బ తీస్తుంది.
- బీపీని కంట్రోల్ చేసుకోండి ఇలా:
- ఆహారంలో ఉప్పును బాగా తగ్గించాలి.
- నవడవడం వల్ల హైబీపీ సమస్యను తగ్గించవచ్చు.
- ఆల్కహాల్, స్మోకింగ్ అలవాటు ఉన్నవారు మానేస్తే హైబీపీ తగ్గుతుంది.
- వీలైనంత వరకు ప్రశాంతంగా ఉండాలి.
- బరువు తగ్గితే బీపీ అదుపులోకి వస్తుంది.
- రెగ్యులర్‌గా మెగా మెడిటేషన్ చేస్తే బీసీ తగ్గుతుంది.





ఉప్పును తగ్గించాలి

అధిక రక్తపోటు వారసత్వంగా కూడా ఇది వస్తుంది. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా హైబీపీ వస్తుంది. ఆహారంలో రోజు 5 గ్రాముల ఉప్పు కంటే ఎక్కువ తినకూడదు.

- డా.ఎన్.చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్



రక్తపోటును నియంత్రించవచ్చు

రక్తపోటును నియంత్రించుకోవచ్చు. లేకపోతే అధిక రక్తపోటు హార్ట్ స్ట్రోక్‌కు ప్రధాన కారణమవుతుంది. నిద్రలేకపోవడం, ధూమపానం, తక్కువ శారీరక శ్రమ వల్ల బీపీ సంభవించే అవకాశాలున్నాయి.

- నాగేంద్ర కుమార్, కార్డియాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

డిగ్రీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయండి

సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వీసీ తనిఖీలు



శంకరాస్ డిగ్రీ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఉపకులపతి

కర్నూలు(అర్బన్), మే 16: డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఉపకులపతి బి. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో 3,374 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెఫ్ మహిళా డి గ్రీ కళాశాలలో రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. అదే విధంగా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రారంభమైన ఏపీఈఏపీ సెట్ పరీక్షా కేంద్రాలను వీసీ పరిశీలించారు. జి.పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ప్రవేశ పరీక్ష తీరును పరిశీలించారు. ఆయన వెంట రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తదితరులు ఉన్నారు.

కౌంటింగ్ విధులకు సచివాలయ సిబ్బంది

జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి



కర్నూలు(న్యూసిటీ), మే 16: జూన్ 4న నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్‌కు సచివాలయ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్నికల సిబ్బందికి సహాయ సహకారాలు అందించేందుకు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారన్నారు. ఈ మేరకు ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు రూరల్ మండలాల నుంచి సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీస్‌కు నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సుమారు 450 సచివాలయ సిబ్బంది సేవలను కౌంటింగ్‌లో ఉపయోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లి మండలంలో భారీ వర్షం

ఎదురుపాడులో నేలకొరిగిన భారీ వృక్షాలు



ఎదురుపాడులో నేలకొరిగిన వృక్షాలు

కొత్తపల్లి, మే 16:కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఎదురుపాడు, కొక్కెరంచ, నాగంపల్లి, జడ్‌వారిపల్లి గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం పడగా.. వివిధ గ్రామాల్లో ఈదురుగాలులతో తుంపర్లతో కూడిన వర్షం పడింది. మండు వేసవిలో ఎండ వేడిమిని తాళలేక ఇబ్బందులు పడిన వృద్ధులు, చిన్నారులకు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. రైతులు దుక్కులు దున్నడం ఆరంభించారు. ఎదురుపాడులో పెనుగాలుల భీభత్సానికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

అరటికి అగ్నిప్రమాదం

3ఎకరాల్లో దెబ్బతిన్న పంట

ప్యాపిలి, మే 16: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 3ఎకరాల్లో అరటి పంట కాలిపోయి రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన శివవెంకటరామిరెడ్డి ఎకరాకు రూ.లక్ష చొప్పున పెట్టు బడులు పెట్టి మూడు ఎకరాల్లో అరటి సాగు చేశారు. పంట చేతి కొచ్చింది. అయితే బుధవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫారంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటలు అరటి తోటకు వ్యాపించాయి. దీంతో మంటలకు అరటి చెట్లు, కాయలు కాలిబూడిదయ్యాయి. అలాగే పొలంలోని డ్రిప్ పైపులు కాలిపోయాయి. రైతు శివవెంకటరామిరెడ్డికి రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. అప్పులు చేసి పంటను సాగు చేశానని, అగ్ని ప్రమాదంలో పంట పూర్తిగా నాశనమైందని రైతు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత



స్ట్రాంగ్‌రూంలలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

నంద్యాల క్రైం/పాణ్యం, మే 16 : పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం యంత్రాల కోసం ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టభద్రత ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గురువారం వారు ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర పోలీస్ బలగాల గార్డులు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డులు, సివిల్ పోలీసు సిబ్బంది కౌంటింగ్ వరకు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదని హెచ్చరించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ పహారా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎలాంటి అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఫైర్ ఇంజన్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు తెరిచేముందు, మూసే సమయంలో సీసీటీవీ కెమెరాల్లో సీల్ కనిపించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. సీసీ పుటేజీలు అన్ని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయబడి 24గంటలు సిబ్బంది పర్యవేక్షిస్తూ ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అపోహలు, తప్పుడు సమాచారాలు నమ్మి ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించి అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటుందని ఎస్పీ హెచ్చరించారు.

కౌంటింగ్‌కు సిద్ధం చేసుకోండి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మే 16: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలలో నిర్వహించే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు కౌటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రతి కౌటింగ్ టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉండాలని, దీనికి 760 మంది సిబ్బంది అవసరం అవుతారని అన్నారు. ఆ మేరకు మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిని, క్యూ ఆర్ కోడ్ రీడర్, పిజియోన్ హోల్, డ్రమ్స్, వివి ప్యాడ్ పిజియోన్ హోల్ తదితర స్టేషనరీ సామాగ్రిని సమకూర్చాలని మెటీ రియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిని, కౌటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలని ట్రైనింగ్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాతనే ఈవీఎంల లెక్కింపు ప్రారంభించాలన్నారు. అన్ని పార్టీల ఏజంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల, సంబంధిత నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు పటిష్ట భద్రత

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్



సూచనలు ఇస్తున్న కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 16: స్ట్రాంగ్ రూముల వద్ద నియమించిన పోలీసు బలగాలు పటిష్టభద్రత అందించేందుకు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన పేర్కొన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాకులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్న సీసీ కెమెరాల లైవ్ ఫీడ్‌ను జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్, పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్యతో కలిసి పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్‌లు 24 గంటలు స్క్రీన్‌లలో డిస్‌ప్లే అవుతూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు షిఫ్టుల ప్రకారం నియమించిన రెవెన్యూ సిబ్బంది వివరాలను పోలీసు అధికారులకు అందజేయాలని డీఆర్వోను ఆదేశించారు. రాయలసీమ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత దృష్ట్యా విధులు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, స్థానిక పోలీసులకు తాగునీరు, భోజన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని డీఆర్వో, టిడ్కో ఎస్‌ఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, కుడా వైస్ చైర్మన్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలంతా చంద్రబాబు వెంటే..

- రాష్ట్ర అభివృద్ధి కోసమే ఎన్డీఏతో పొత్తు
- ముస్లిం మైనార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కర్నూలు(అర్బన్), మే 16: కుల, మతాలకు అతీతంగా పనిచేసే చంద్రబాబు నాయుడు లౌకికవాది అని, ముస్లింలందరూ ఆయన వెంటే ఉన్నారని మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. అబ్దుల్ రజాక్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ముస్లిం సమాజానికి ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. కూటమి ఆధ్వర్యంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటారన్నారు. ఒక కన్ను ముస్లింలు, మరో కన్ను హిందువుల్లా చంద్రబాబు గతంలో పాలన కొనసాగించారని కొనియాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మల్లెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో పోలీసు బలగాల మోహరింపు

పట్టణంలో 144 సెక్షన్ అమలు

ఆళ్లగడ్డ, మే 16: ఆళ్లగడ్డలో మాజీ మంత్రి అఖిలప్రియ బాడీ గార్డ్ నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసును దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు బలగాలను మోహరించాయి. ఆళ్లగడ్డ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసు బలగాలను ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు మోహరింపజేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ గురువారం చెప్పారు. ఆళ్లగడ్డ పోలీసు సబ్ డివిజన్‌లోని ముగ్గురు సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులను రప్పించామన్నారు. పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు.

పెరిగిన పోలింగ్ కూటమి విజయానికి సంకేతం

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), మే 16: రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన పోలింగ్ ఎన్డీయే కూటమి విజయానికి సంకేతమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం.ప్రజలు ఓటు వేయడం వల్లే పోలింగ్ శాతం పెరిగిందన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిశెట్టి మాట్లాడారు. జగన్‌ను ఇంటికి పంపాలనే కసితో ప్రజలు టీడీపీకి ఓటు వేశారన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన నీచుడిని, ఆయనను ఇంటికి పంపేందుకు ప్రజలు టీడీపీకి ఓటు వేశారన్నారు. ఓటింగ్ రోజు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనా పాలనలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాని తెలిపారు. దేశ, విదేశాలు, నగరాలను, పట్టణాల నుంచి స్వస్థలాలకు చేరుకుని ఓటు వేయడం అంటే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారని, జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమవ్వడమే కాక, అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు. మార్చి నాలుగోతేదీ తర్వాత ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని సోమిశెట్టి పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

కర్నూలు(అర్బన్), మే 16: రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం డబ్బును వరదలా పారించాయని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీ కే.బాబురావుతో కలిసి ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని ధ్వజమెత్తారు. ఎన్నికల తీరు మారాలని, రాష్ట్రంలో జరిగిన పోలింగ్ తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో షర్మిల నాయకత్వంలో పని చేయడానికి ఎందరో నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ టీడీపీ, వైసీపీలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఉండవల్లి వెంకటన్న, అశోకరత్నం మాదిగ, బ్రతుకన్న, బీ.రామాంజనేయులు, లాజర్, షేక్ ఖాజా హుస్సేన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ప్రబలిన అతిసార

బండిఆత్మకూరు, మే16: మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో 15 మందికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. గురువారం ఉదయాన్నే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 11 మందిని బంధువుల తరలించారు. గ్రామానికి చెందిన నాయుడు, సుబ్బరాయుడు, ఉశ్శేనమ్మ, వెంకటస్వామి, సాయిబీ, తులశమ్మ, పెద్దకాశీం, సుంకేశ్వరమ్మ, హుస్సేన్, దేవభూషి, సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, మద్దమ్మ, మద్దిలేటి, రంగమ్మలను అతిసారతో ఆసపత్రుల్లో చేరారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ శ్రీనివాసులు, ఏఈ లక్ష్మీనరసింహ, ఈవోఆర్డీ శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని వాంతులు, విరేచనాలు కావటానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. నీటి నమూనాలు తీసుకున్నారు. హోటళ్ళలో పదార్థాలపై వాకబు చేశారు. స్థానికంగా మంచి నీటి సరఫరా నిలిపి వేసి, బయటి గ్రామాల నుంచి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ భావన, సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

అక్రమంగా ఇసుక తవ్వితే చర్యలు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), మే 16: అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం సీ. బెళగల్ మండలం కే సింగవరం వద్ద అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ తవ్వకాల కోసం ఉంచిన వాహనాలు, తదితర సామగ్రిని యజమానులు అక్కడి నుంచి తరలించాలని ఆదేశించామన్నారు. ప్రస్తుతం తవ్వకాలు జరిగడం లేదని, ఎవరైనా తవ్వకాలను పాల్పడితే చర్యల తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పులకించిన పులకుర్తి

- ఘనంగా సాయినాథుడి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సాయినామస్మరణతో కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామం పులకించింది. సద్గురు సాయిబాబా రథోత్సవాన్ని గురువారం సాయంత్రం రథోత్సవం గ్రామంలో కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. సాయంత్రం సాయినాథుడి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల నడుమ తీసుకొచ్చి సుందరంగా ముస్తాబు చేసిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం టెంకాయలు, గుమ్మడి కాయలు సమర్పించి సాత్విక బలిదానం చేశారు. భక్తులు సాయినామస్మరణ చేస్తూ రథాన్ని లాగడానికి యువకులు, భక్తులు పోటీపడ్డారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆలయంలో కర్నూలు స్పెషల్ పోలీసు డీఎస్పీ మహబూబ్ బాష పూజలు నిర్వహించారు. పూజారులు డీఎస్పీని సత్కరించారు.

- కోడుమూరు రూరల్



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

లోయలో మినీ ట్రక్ బోల్తా

- నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం
- 15 మందికి తీవ్రగాయాలు
- క్షతగాత్రులు ప్యాలకుర్తి వాసులు

పెద్ద దోర్నాల, మే 16: వేగం అదుపుతప్పిన మినీ ట్రక్ లోయలో బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం నల్లమల అటవీ ప్రాంతం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో చిన్నారుట్ల మూలమలుపు వద్ద చోటుచేసుకొంది. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన 15 మందికి గాయాలయ్యాయి.


గాయపడిన వారిని వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం


లోయలో బోల్తా పడిన వాహనం

పోలీసులు తెలిసిన కథనం ప్రకారం.. కోడుమూరు మండలం నుంచి మినీ ట్రక్‌లో 25 మంది భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళుతున్నారు. చిన్నారుట్ల మూలమలుపు వద్ద వేగం అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టి లోయలోకి దూసుకుపోయింది. చెట్టుకు తాకడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు లోయలోకి పూర్తిగా పోకుండా చెట్టు నిలువరించింది. దీంతో ప్రాణనష్టం జరగలేదు. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దగ్గరలోని సుండిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

కల్లూరు, మే 16: కల్లూరు మండలం తడకనపల్లె, పెద్దటేకూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోజూ 4600 మంది కూలీలు హాజరు కావాల్సి ఉండగా 3వేల మంది పనులకు వస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి జూన్ 1 లోపు 75 పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందజేస్తున్నామని, అర్హత ఉన్న వారందరూ ఉపాధి పనుల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీఓ మద్దీశరమ్మ ఉన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమ చేయాలి

కర్నూలు(న్యూసిటీ), మే 16: జిల్లాలో 2023 ఖరీఫ్, రబీలో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్‌లో వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కొన్ని ప్రాంతాలలో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదు కుంటామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల ముందు లబ్ధి పొందేందుకు కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చి ఇన్‌పుట్ సబ్సిడీ వేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఎన్నికల కమిషన్ అంగీకరించకపోవడంతో సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేయాలని వారు డిమాండ్ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్, మే 16: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శకుంతల తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో దోపిడీని అరికట్టండి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 16: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టి అక్కడ జరుగుతున్న దోపిడీని నివారించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురు వారం స్థానిక సీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షుడు సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయన్నారు. అలాగే పాఠశాలలు తెరవకముందే స్టేషనరీ, బుక్స్, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు విక్రయాలు అధిక రేట్లకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తు న్నారని ఆరోపించారు. అడ్మిషన్లు, అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదం డ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నాయకులు అజయ్, మౌలాలి, షఫి పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు


గూడూరులో ఇరుకు రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు

గూడూరు, మే 16: పేరుకే నగర పంచాయతీ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉందనేది ఇక్కడి రోడ్లను చూస్తేనే తెలుస్తోంది. గూడూరు నగర పంచాయతీలో దాదాపు ఇరవై మూడు వేల జనాభా ఉంది. ఇరవై వార్డులు ఉన్నాయి. అయితే నగర పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకు రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కర్నూలు వైపు నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్లే రహదారితో పాటు కోడుమూరు వైపు వెళ్ళే రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రహదారి విస్తరణ కాస్త అటకెక్కడంతో ఇరుకు రోడ్లతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి


వృద్ధులకు అన్నదానం చేస్తున్న సురేంద్ర

కర్నూలు(స్పోర్ట్స్), మే 16: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సురేంద్ర అన్నారు. గురువారం టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జిల్లా రగ్బీ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని బీ.క్యాంపులో ఉన్న మన వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ


ట్రైనీ కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మే 16: కర్నూలు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి నగరంలోని వివిధ కూడళ్లు, పార్కుల ఆధునికీకరణ, పలు జంక్షన్లలో జరుగుతున్న ప్రగతి పనులను పరిశీలించారు. నగరంలోని కొండా రెడ్డి బురుజు వద్ద చేపడుతున్న కూడలి ఆధునికీకరణ పనులు, పరిమళ నగర్ పార్కులో జరగాల్సిన సుందరీకరణ పనులు, వెంకటరమణ కాలనీ ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇంకా మిగిలి ఉన్న చిన్నపాటి పనులు కిడ్స్ వరల్డ్, బిర్లాగేటు జంక్షన్ వద్ద జరుగుతున్న కూ డలి అభివృద్ధి పనులు వారు పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరు ణంలో రహదారిపై వెళ్లే వాహనాలు, పాదాచారులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కమిషనర్ వెంట నగర పాలక ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు షాకీర్ హుసేన్, శేష సాయి, డీఈలు కృష్ణలత, రవిప్రకాష్ నాయుడు, గిరిరాజు, రాజశేఖర్, హార్టిక ల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఏఈలు దినేష్,జనార్దన్, ప్రవీణ్, రాచ్చయ్య ఉన్నారు.

మంత్రి బుగ్గనను అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న రాగిరి చంద్రప్ప

కర్నూలు(కలెక్టరేట్), మే 16: మాజీ పోలీసు అధికారి పీఎన్ బాబుపై భౌతిక దాడులకు పాల్పడిన కేసులో మంత్రి బుగ్గనను అరెస్టు చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. గురువారం టీఎస్ఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో డోన్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పీఎన్ బాబును మంత్రి బుగ్గన తన అనుచరులు కులం పేరుతో దూషించి, చంప డానికి ప్రయత్నించడం పిరికిపంద చర్య అన్నారు. పీఎన్ బాబుపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, మధుకృష్ణ, రామరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.


గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఇనగండ్లలో రోడ్డుపై నిలిచిన మురుగు

సి.బెళగల్, మే 16: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లో ప్రధాన రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతు న్నారు. మండలంలోని ఇనగండ్ల, తిమ్మనదొడ్డి, బ్యాథోళి, ఈర్లదిన్నె, కొండాపురం, సంగాల, సి.బెళగల్ తదితర గ్రామాలలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్య నిలుస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై మండల ఈవోఆర్డీ సందీప్‌ను వివరణ కోరగా పంచాయతీలకు నిధులు అరకొరగా ఉన్నందున ఎక్కడ కూడా మురుగు కాలువలు నిర్మించలేక పోతున్నామని చెప్పారు.

రోడ్డు వేసే దిక్కు లేదు


ఇనగండ్ల నుంచి కొండాపురం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

సి.బెళగల్, మే 16: మండలంలోని ఇనగండ్ల, కొండాపురానికి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఎప్పటికి మారుతుదని కొండాపురం గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు ఎన్నిసార్లు జరిగినా, నేతలు ఎంత మంది మారినా తమ గ్రామానికి రోడ్డు మాత్రం వేసే దిక్కు లేదని వాపోతు న్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు రోడ్డు వేయిస్తామని చెప్పడమే కాని ఆచరణలోకి రావడం లేదని గ్రామస్థులు విమర్శిస్తు న్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరారు.

ఘనంగా టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు



టీజీ వెంకటేశ్‌ను పూలమాలతో సన్మానిస్తున్న అభిమానులు, టీజీ వెంకటేశ్‌తో జబర్దస్త్ కళాకారులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 16: రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలను నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంకల్‌బాగ్‌లో ఉన్న ఆయన నివాసంతోపాటు హోటల్ మౌర్య ఇన్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆయన కార్యాలయం అభిమానులతో కిక్కిరిసిపోయింది. కర్నూలు జిల్లా తోపాటు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి ఆయన అభిమానులు తరలివచ్చి టీజీ వెంకటేశ్‌కు పూలమాలలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నగరంలోని పలువురు ప్రముఖులు, సామాజికవర్గాలకు చెందిన సం ఘాల ప్రతినిధులు, టీజీ గ్రూపు సంస్థల ఉద్యోగులు, సిబ్బంది తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు నగరాభివృద్ధికి కృషి: టీజీ

కర్నూలు(కల్చరల్): గత యాభై ఏళ్లుగా కర్నూలు నగరా భివృద్ధికి కృషి చేస్తున్నానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ 74వ జన్మదిన వేడుకలను కళాకారులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. జబర్దస్త్ టీమ్ కళాకారులను టీజీ వెం కటేశ్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తాను ముందుకు వెళ్తున్నానని అన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో అందించే వినోద అంశాల్లో భాగంగా జబర్దస్త్ కళాకారులతో కార్యక్రమం నిర్వ హించడం సంతోషంగా ఉందన్నారు. జబర్దస్త్ కళాకారులు ప్రదర్శించిన వివిధ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అదుర్స్ ఫణి, వినోదిని, ఆనంద్, షేకింగ్ శేషు హాస్యసన్నివేశాలతో ఆకట్టుకున్నారు.

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలను తైక్వాండో క్రీడాకారులు ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న టీజీ నివాసంలో టీజీవీ, టీజీబీ స్పోర్ట్స్ అకాడమీ తైక్వాండో విద్యార్థులు టీజీ వెంకటేశ్‌ను కలిసి శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీజీవీ, టీజీబీ స్పోర్ట్స్ అకాడమి శిక్షకుడు తెలుగు వెంకటేశ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, బీఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు బొలెద్దుల రామక్రిష్ణ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

మూడేళ్ల చిన్నారికి ప్రాణం పోసిన వైద్యులు


మాట్లాడుతున్న ఆస్పత్రి డైరెక్టర్ ఎం. విజయకుమార్

కర్నూలు(హాస్పిటల్), మే 16: టెట్రాలజి ఆఫ్ ఫాలోట్ అనే అరుదైన గుండె సమస్యతో బాధపడుతున్న 3ఏళ్ల బాలుడికి శ్రీచక్ర హాస్పిటల్ వైద్యులు అరుదైన గుండె ఆపరేషన్ నిర్వహించి ప్రాణాన్ని కాపాడారు. నగరానికి చెందిన అబ్దుల్ కలాం పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మూడేళ్ల కుమారుడు సమీర్‌బాషా పుట్టుకతో గుండెలో వచ్చే టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్ జబ్బు వల్ల ఆయాసం రావడం, ఎదుగుదల లేకపోవడం సమస్యను ఎదుర్కొంటున్నారు. దీని వల్ల శరీరంలో ప్రసరించే రక్తంలో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండటంతో తీవ్రమైన ఆయాసంతో బాధపడుతున్నారు. చాలా హాస్పిటల్స్‌లో తల్లిదండ్రులు తిరిగిన చివరకు శ్రీచక్ర హాస్పిటల్‌ను సంప్రదించారు. దీంతో సిటీ సర్జన్ డా.గౌతమ్ ఆత్మకూరు అనస్థీషియా హెడ్ డా.భానుప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆరోగ్యశ్రీ ద్వారా బాలుడికి గుండె ఆపరేషన్ నిర్వహించి ప్రాణాన్ని కాపాడారు. ఆపరేషన్ అయిన వెంటనే బాలుడు శ్వాస తీసుకోవడం మెరుగైందని శ్రీచక్ర ఆస్పత్రి డైరెక్టర్ ఎం. విజయ కుమార్ రెడ్డి తెలిపారు. త్వరలో న్యూరో సర్జరీ, న్యూరాలజి గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు ప్రారంభిస్తామన్నారు. సిటీ సర్జన్ డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 3వేల మందిలో ఒకరికి ఈ జబ్బు వస్తుందని తెలిపారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు, మే 16: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత ఐటీఐ కోర్సుల్లో ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూరప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి


ఎస్ఎస్ఏ ఏపీసీకి వినతి పత్రం ఇస్తున్న జేఏసీ ఉద్యోగులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 16: జిల్లా సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని జేఏసీ సం ఘం జిల్లా శాఖ ఎస్ఎస్ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెల జీతం పెండిం గ్‌లో ఉందని, ఈ ఉద్యోగులకు పెంచిన జీతంతోపాటు అరియర్స్‌ను కూడా వెంటనే చెల్లించాలని కోరారు. ఇతర జిల్లాలోని ఉద్యోగులకు చెల్లించినప్పటికీ కర్నూలు జిల్లాలోని ఉద్యోగులకు మాత్రమే జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. ఎస్ఎస్ఏ ఏపీసీని కలిసిన వారిలో జేఏసీ నాయకులు రాజు, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్‌రఫీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జేఏసీ కమిటీ నాయకులు ఉన్నారు.

పల్లె గొంతెండుతున్నా పట్టించుకోరా..?


నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

సి.బెళగల్, మే 16: ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన తాగునీటి ట్యాంకులు నిరు పయోగంగా మారాయి. మండలంలోని ఇనగండ్ల, తిమ్మనదొడ్డి, చింత మానుపల్లె, సంగాల, పోలకల్లు గ్రామాల్లో గ్రామాల్లో 2006లో రూ.4లక్షలతో తాగునీటి ట్యాంకును ప్రభుత్వం నిర్మించింది. అయితే అప్పటి నుంచి ట్యాంకులు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయే తప్ప వినియోగంలోకి ఎప్పుడు వచ్చేది తెలియని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. తాగునీటి సమస్య ఉందని మండలస్థాయి అధికారులకు ప్రజలు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తమ గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

బస్సు ఎప్పుడొస్తే అప్పుడే ఆఫీసు

సి.బెళగల్, మే 16: మండలంలోని ఆర్టీసీ బస్సు వేళలే సచివాలయ ఉద్యోగుల పని వేళలుగా మారాయని బ్రాహ్మణ దొడ్డి, బురాన్‌దొడ్డి, కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, సంగాల, కంబందహాల్, గొల్లలదొడ్డి గ్రామాల ప్రజలు అంటున్నారు. ఈ గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు బస్సులు ఎప్పుడు వస్తే అప్పుడు ఆఫీసులకు వస్తున్నారని వారు గురువారం అన్నారు. ఏదైనా పనిబడి సచివాలయానికి వెళ్తే అధికారులు ఎవరు ఉంటారో, ఎవరు ఉండరో తెలియడం లేదని అన్నారు. సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీడీవో శకుంతల తెలిపారు.


బ్రాహ్మణదొడ్డి సచివాలయం ఇదే..

డెంగీ నివారణకు కృషి చేద్దాం: డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్), మే 16: డెంగీ నివారణకు కృషి చేద్దామని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా నగరంలోని రోజావీధి-2 అర్బన్ హెల్త్‌సెంటర్‌లో జిల్లా మలేరియా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. అనం తరం డీఎంహెచ్‌వో తన చాంబరులో మలే రియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎ.నూకరాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు, డెమో ప్రమీలదేవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, వైద్యాధికారులు శ్రీదేవి, ఫాతిమా, వెంకట ప్రవీణ్, ముసాహిద్ చౌదరి, ప్రొజెక్షనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ ఏడీస్ ఈజిప్ట్ దోమ పగటి పూట కుట్టడం వలన డెంగీ జ్వరం వ్యాపిస్తుందన్నారు. దీని వలన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఛాతి, కంటి కదలికతో కళ్ల వెనుక నొప్పి, దద్దుర్లు, వాంతులు వంటి లక్షణాలు ఉన్నట్లయితే డెంగీ జ్వరం అని అనుమానించవచ్చని అన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్‌బాస్కర్, వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, కమాల్‌సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఇంటర్ ప్రవేశాలకు 22 నుంచి దరఖాస్తులు

మద్దికెర, మే 16: మద్దికెర ఆదర్శ పాఠశాలలో ఈ నెల 22 నుంచి 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరానికి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. గత నెల నుంచి అప్లికేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పదవ తరగతిలో సాధించిన మెరిట్ రిజర్వేషన్ల నిబంధనల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే వారు ఆన్‌లైన్ చేసుకోవలన్నారు. ఓబీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150ల చొప్పున ఫీజు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వేసవి అలవెన్సులేవీ?

● ఉపాధి పనులకు ఆసక్తి చూపని కూలీలు



ఉపాధి పనుల చేస్తున్న కూలీలు

మద్దికెర, మే 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేద కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజురోజుకు నీరు గారుతోంది. గతంలో పనికి వెళితే.. వేతనాలు వెంటనే అందేవి. ప్రస్తుతం పని చేసినా 5-6 వారాలు కూడా వేతనాలు ఇవ్వకపోవడం, పనులకు తగ్గ కూలిలు రాకపోవడం వంటి కారణాలతో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి తగ్గిస్తున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. 10,500 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి రోజూ 6వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవి కాలం వచ్చిందంటే.. వేసవి భత్యం కింద పరికరాలకు అదనంగా సొమ్ములు వేసేది. ప్రభుత్వం గడ్డపారకు రూ.10లు, మంచినీటికి రూ.5లు, తట్టకు రూ.5లు వేసవికి అలవెన్సులో ఉండేవి. రెండేళ్లుగా అవి కూడా రావడం లేదని కూలీలు చెబుతున్నారు. కనీసం పనులు చేసే సమయంలో ఏ చిన్న గాయమైనా ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి ప్రాథమిక వైద్య కిట్లు ఇచ్చేవారని, ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో వేసవి కిట్లు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ ఇవ్వడం లేదని తెలిపారు. ఉపాధి హామీ రోజురోజుకు నీరు గారుతోంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మండుటెండల్లో పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి అలవెన్సులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీవో నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదని నేరుగా వారి ఖాతాల్లోనే పడుతాయన్నారు.

930 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల మంజూరు

మద్దికెర, మే 16: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రాయితీకింద అందజేసే వేరుశనగ విత్తనాలు 930 క్వింటాళ్లు మంజూరైనట్లు వ్యవసాయాధికారి రవి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కే-6 రకం 860 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 70 క్వింటాళ్లు మంజూరయ్యాయని తెలిపారు. విత్తనాలు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ధర నిర్ణయించలేదని, ధరతో పాటు పాసు పుస్తకానికి ఎన్ని బస్తాలు ఇస్తాయో తెలుస్తుందని పేర్కొన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు, మే 16: ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత ఐటీఐ కోర్సుల్లో ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూరప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మెకానిక్, డీజెల్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆలూరు ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. కర్నూలు తాండ్రపాడులో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైలెంట్ ఓటింగ్... కూటమి విజయానికి సంకేతం

ఆదోని టౌన్, మే 16: ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎవరూ ఊహించని విధంగా సైలెంట్ ఓటింగ్ జరిగిందని, అదే మా విజయానికి సంకేతంగా భావిస్తున్నామని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆదోని అసెంబ్లీకు ఈ సారి మూడవ వ్యక్తిని కోరుకోవడంతో విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపారులు, మేధావులు కూటమి అభ్యర్థి వైపుకే మొగ్గు చూపడం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ ఎన్నికలలో ఓటు హక్కు పొందిన దాదాపు 20 వేల మంది కొత్త యువ ఓటర్లు కూటమి గెలుపును కోరుకుంటూ పోలింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఈసారి 1.5 శాతం పోలింగ్ పెరగడం కూటమి గెలుపుకు సంకేతంగా సూచిస్తున్నాయని తెలిపారు. 10 నుండి 15వేల మెజార్టీతో కూటమి అభ్యర్థి గెలుపును ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

సత్తాచాటిన జవహార్ నవోదయ విద్యాలయం

ఎమ్మిగనూరు రూరల్, మే16: ఎమ్మిగనూరు మండలంలోని జవహార్ నవోదయ విద్యాలం సీబీఎస్ఈ 10,12తరగతుల ఫలితాల్లో సత్తాచాటింది. విద్యాలయంలో 10,12తరగతులు చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఈ పద్మావతి తెలిపారు. 10వ తరగతిలో మొదటి ర్యాంకు ఎస్ చరణ్(583/600), ద్వితీయ ర్యాంకు వీరేష్(550/600),మూడో ర్యాంకు కే మారుతి(543/600), 12వ తరగతిలో యు తరుణ్ మొదటి ర్యాంకు (455/500), ద్వితీయ ర్యాంకు సాయి సుజీత్ (442/500), మూడో ర్యాంకు ఏ ధర్మేంద్ర (427/500)లు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ ఫలితాలు చూసుకోవచ్చన్నారు. తమ రోల్ నంబర్‌తో పాటు స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డు ఐడీని ఎంటర్ చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. వీటితో పాటు డిజిలాకర్, పరీక్షా సంగమ్ వెబ్ సైట్లు ద్వారా కూడా తమ ఫలితాలు చేసుకోవచ్చన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.46 వేలు విరాళం

కౌతాళం, ఏప్రిల్ 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రము ఉరుకుంద ఈరన్న స్వామి వారికి సోమవారం రోజున ఓ భక్తుడు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.46,600వేల నగదును స్వామి వారి దేవస్థానానికి విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారికి దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం ఐజ వాస్తవ్యులు విజయ్‌కుమార్, శిరీష కుటుంబ సభ్యులు రూ.46,600 నగదును దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ప్రత్యేక పూజలు చేపట్టి స్వామి వారి శేషావస్త్రాలు, ఫలపుష్పలను అందజేశారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం





వర్షం కురిసి భూములు పదును కావటంతో దుక్కి దున్నుతున్న రైతు. ట్రాక్టర్‌తో టిల్లర్ కొడుతున్న రైతు

● వర్షం రాకతో భూములను సిద్ధం చేస్తున్న రైతులు
● ఖరీఫ్ ప్రణాళిక ప్రతిపాదనలు పంపిన అధికారులు

ఎమ్మిగనూరు, మే16: ఎమ్మిగనూరు మండలంలో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఐదురోజుల క్రితం భారీవర్షం కురువటం.. భూములు పదును కావటంతో రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా దుక్కి దున్నటంతో పాటు పొలాల్లో గతంలో సాగుచేసిన పంటల ఆనవాళ్లను తొలగిస్తున్నారు. మండల పరిధిలో 18400 హెక్టార్లు వ్యవసాయ భూమి ఉంది. ఇందులో రైతులు అత్యధికంగా పత్తి, మిరప పంటలు సాగుచేసే అవకాశం ఉంది. స్వల్పంగా వేరుశనగ, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను సాగుచేయనున్నారు. గత ఏడాది సైతం అత్యధికంగా పత్తిపంటను సాగుచేశారు. ఈ ఏడాది కూడా రైతులు పత్తిపంటనే ఎక్కువగా సాగుచేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎమ్మిగనూరు మండలంలో ఖరీఫ్, రబీ కలిపి 670 ఎంఎం సాధారణ వర్షపాతం. మరి ఈ ఏడాది ఏ మేరకు నమోదు అవుతుందో చూడాల్సి ఉంది.

● **వ్యవసాయ అధికారుల ప్రణాళిక.. ప్రతిపాదనలు :** ఎమ్మిగనూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుకానున్న 18400 హెక్టార్లలో దాదాపు 13000 హెక్టార్లలో పత్తి, 4000 వేల హెక్టార్లలో మిరప, 1400 హెక్టార్లలో ఇతర పంటలు సాగుకానున్నాయి. ఇందుకు గాను మూడు లక్షల పత్తి విత్తన పాకెట్లు, ఐదువేల కిలోల మిరప విత్తనాలు అవసరమని, అలాగే సబ్సిడిపై ఇచ్చే వేరుశనగ 400క్వింటాళ్లు అవసరమని ప్రభుత్వానికి స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపారు. అలాగే 12వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అయితే ఇప్పటికే మార్కెట్‌లో లక్షన్నర పత్తివిత్తన పాకెట్లు అందుబాటులో ఉండగా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

● **60 ఎంఎం వర్షపాతం నమోదైతే విత్తనం వేసుకోవచ్చు**
మామూలుగా 60 ఎంఎం వర్షపాతం నమోదైతే భూములు పదును అవుతాయి. దీంతో విత్తనం వేసుకోవచ్చు. ప్రస్తుతం కురిసిన వర్షానికి విత్తనం వేసుకోవచ్చు. ఖరాఫ్‌సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.
- మహేశ్వరరెడ్డి, ఏఓ, ఎమ్మిగనూరు

యువ రైతు ఆత్మహత్యాయత్నం

కోసిగి మే 16: ఖరీఫ్ ఆరంభమవుతున్న సమయంలో పంట పెట్టుబడికి డబ్బు లేక కోసిగి మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామానికి చెందిన యువ రైతు జంగం హనుమంతరెడ్డి గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ మనోజ్ కుమార్ మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.



చికిత్స పొందుతున్న రైతు జంగం హనుమంతరెడ్డి

హనుమంతరెడ్డి భార్య మంగమ్మ తెలిపిన వివరాల మేరకు తమకు ఐదెకరాల పొలం ఉందని, గత ఏడాది సరైన పంటలు రాక రూ.3 లక్షల మేర అప్పు చేశామని, ఈ ఏడాది కూడా పంటకు డబ్బు లేక రోజూ మదనపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఆదోనిలో ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి కోసిగి పోలీస్‌స్టేషన్‌కు రెఫర్ చేశారు.

ఉరుకుందలో నేడు టెండర్లు

కౌతాళం, మే 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి సంబంధించిన వివిధ పనులకు శుక్రవారం ఆలయ కార్యాలయంలో వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ వెంకటేష్, పాలక మండలి ఛైర్మన్ నాగరాజుగౌడ్‌లు తెలిపారు. ఆసక్తిగల పాటదారులు షరతులకు లోబడి వేలం పాటలలో పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే శనివారం దేవాలయంకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పల్లెల్లో దాహం.. దాహం

● వేసవిలో గొంతెండుతున్న గ్రామాలు
● ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి కష్టాలే
● ముందస్తు జాగ్రత్తలు లేక జఠిలమైన సమస్య

ఆస్పరి/తుగ్గలి, మే 16: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. మండలంలో 33 గ్రామాలు, 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఇంతవరకు కనీస చర్యలు చేపట్టలేదు. ప్రతి వేసవిలో నీళ్లో రామచంద్ర..!! అని మండల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. మండలంలో 8 గ్రామాల తాగునీటి కోసం అమలు చేస్తున్న నాగనాథనాపల్లి వాటర్ రిజర్వాయర్ స్కీం, బాపురం రిజర్వాయర్ స్కీం నీటి పథకాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో నీటి పథకంలో ఉన్న చివరి గ్రామాలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలిగెర, చిరుమాన్‌దొడ్డి, ఆస్పరి, చిగిలి, నగరూరు, శంకరబండ, తంగరడోణ గ్రామాలలో నీటి పథకాలు ఉన్న గ్రామస్థుల దాహం తీరడం లేదు. రిజర్వాయర్ నుంచి తాగునీటి పంపింగ్ చేయడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు, విఫలమయ్యారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. బాపూరం రిజర్వాయర్ స్కీమ్ ద్వారా జోహరాపురం, చిన్నహోతూరు గ్రామాలకు పది రోజులకొకసారి కూడా తాగునీరు రావడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐనేకల్, కైరుపుల, కల్లపరి, డీ కోటకొండ, కారుమంచి, ములుగుందం



అలిగెర గ్రామంలో నీటికోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

గ్రామాలలో తాగునీటి కోసం తోపుడు బండ్లు, ఎద్దుల బండ్లు, స్కూటర్ల పై వెళ్లి సమీప బోరు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దేశాయితండాలో తాగునీటికి కటకటా

తుగ్గలి మండలంలోని దేశాయితాండాలో దాదాపు 2వేల మంది జనాభా నివసిస్తున్నారు. వారి దాహార్తిని తీర్చేందు కోసం ఓవర్ హెడ్ ట్యాంకుతో పాటు బోర్లు, చేతి పంపులు ఉన్నాయి. వర్షాలు లేక భూగర్భ జలాలు ఇంకిపోవడంతో కొళాయిలు సక్రమంగా రాక బిందె నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని గ్రామస్థులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వర్ణ పల్లకీలో రాఘవేంద్రులు

● శోభాయమానంగా బృందావనం

మంత్రాలయం, మే 16 : రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం పండితులు,అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకీలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు మంగళవాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాఘవరాయుడి బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. పీఠాధిపతి భక్తులకు ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేసిమొక్కులు తీర్చుకున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కలబురిగి జిల్లా ఎస్పీ

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక లోని కలబురిగి జిల్లా ఎస్పీ వీరభద్రయ్య గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికా



రాఘవేంద్రస్వామి పల్లకోత్సవానికి హాజరైన భక్తులు

రు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల నొక్కుడు..

● డబ్బు పంపిణీలో చేతివాటం
● వెలుగులోకి వస్తున్న ఫిర్యాదులు
● తలలు పట్టుకుంటున్న అభ్యర్థి

ఆలూరు, మే 16: ఎన్నికల్లో 80 శాతం ఓటర్లకు డబ్బు పంపిణీ చెయ్యాలనే ఉద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార పార్టీ అభ్యర్థికి ఒక్కొకటిగా గ్రామాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల ముందే గ్రామాల్లో క్యాడర్‌కు డబ్బు చేరవేసినా గ్రామస్థాయిలో కొందరు వైసీపీ నాయకులు చేతివాటం ప్రదర్శించారు. ఓటర్లకు డబ్బు ఇవ్వకుండా జాబితాలో ఇచ్చినట్లు టిక్కులు కొట్టేశారు. ఎన్నికల బిజీలో ఉన్న అభ్యర్థికి, ఎన్నికల తరువాత నుంచి ఒక్కొక్కటిగా తేలడంతో తలలు పట్టుకుంటున్నారు. కొందరి నాయకులపై కూడా అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆలూరు మండలంలో ఓ



గ్రామంలో దాదాపుగా రూ.5 లక్షల మేర ఓ నాయకుడు నొక్కినట్లు వైసీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.. మరోవైపు నోట్ల కట్టలలోనే డబ్బులు తక్కువగా ఇచ్చారని, మర్యాద పోతుందని తమ చేతి నుంచి ఇచ్చామని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఈ విషయంపై వైసీపీ అభ్యర్థి విరూపాక్షి దృష్టి సారించారు. ఎవరికి ఏ గ్రామానికి ఎంత ఇచ్చామో? ఎంత మేర పంపిణీ చేశారో..? ఎంత నొక్కేశారో..? అనే విషయం పై గ్రామస్థాయిలో నాయకుల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. ఇదే ప్రభావం ఓటర్లపై పడిందా? డబ్బు అందని వారు తమకు ఓటు వేసి ఉంటారా ? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎంటీ కాలనీలో నీటి ఎద్దడి

ఎమ్మిగనూరు టౌన్, మే 16 : స్థానిక ఎస్ఎంటీ కాలనీలో తాగు నీటి సమస్య తీవ్రమైంది. ఆదోని బైపాస్ గుండా విస్తరించివున్న ఈ కాలనీలో నాగప్ప కట్ట, మాత్రాలతిమ్మప్ప గుడి, సాయి నగర్, లక్ష్మణ్ టాకీస్ కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలో దాదాపు ఆరువందల కుటుంబాలకు పైగా జీవనం కోనసాగిస్తున్నారు. ఈ కాలనీకి కూత వేటు దూరంలో ఎస్ఎస్ ట్యాంక్ ఉంది. ఈ కాలనీ కొంత ఎగువ ప్రాంతంలో వుండడం వలన మున్సిపాలిటి నుంచి సరఫరా అయ్యే నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పైగా వేసవి కాలం కావడంతో నీటి సమస్య తీవ్రంగా మారింది. కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేసి మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. అధికారులు చుట్టపు చూపుకు అన్నట్లు వాటర్ ట్యాంకర్లను పంపి చెతులు దులుపుకుంటున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు.

మండుతున్న పచ్చి మిర్చి

● కిలో రూ.120

ఆదోని, మే 16: పచ్చిమిర్చి ధరలు మండుతున్నాయి. వారం క్రితం వరకు కిలో రూ.40-రూ.50 పలికిన ధర, ఇటీవల భారీగా పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.120 వరకు పలుకుతోంది. సూపర్‌మార్కెట్లు, ఆన్‌లైన్ యాప్స్‌లో ఈ ధరలు మరింత అధికంగా ఉన్నాయి. ఆదోని రైతుబజారులో గురువారం కిలో రూ.80 నుంచి 100 వరకు విక్రయించారు. వేసవి ప్రభావంతో పచ్చిమిర్చి సాగు తగ్గడమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు.



పత్తిధర రూ.7,490



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన పత్తి

ఆదోని (అగ్రికల్చర్), మే 16: ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో పత్తిధరలు స్వల్పంగా పెరిగాయి. గురువారం పత్తి ధర క్వింటాలు గరిష్టంగా రూ.7,490 పలికింది. గత వారంతో పోల్చితే పత్తి ధరలు క్వింటానికి రూ.200లు పెరిగింది. గత ఆరు నెలలుగా పత్తి ధరలు రూ.7,500 మించి పలకడం లేదు. ఖరీఫ్ సాగుకు సమాయాతం అవుతున్న తరుణంలో ధరలు జరగకపోవడంతో పత్తి సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపడం లేదు. 546 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా, వాటి కనిష్ట ధర రూ.5,290, గరిష్ట ధర రూ.7,490, మధ్య ధర రూ.7,239 పలికింది.

ఎస్సీ కాలనీలో 15 రోజులుగా నీటి సరఫరా బంద్



సజ్జలగుడ్డం కురువల కాలనీలో బోరు నీటి కోసం ఎదురు చూస్తున్న ఎస్సీ కాలనీవాసులు

కోసిగి మే 16: సజ్జలగుడ్డం గ్రామంలోని ఎస్సీ కాలనీలో 15 రోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ కాలనీవాసి మూకప్ప ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా దళితుల కాలనీలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, గ్రామ సర్పంచు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. దళితులంటే ఇంత చిన్న చూపు చూడడం తగదని మూకప్ప, దళిత కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కురువ కాలనీలో కొత్తగా వేసిన బోరు నీటి కోసం అక్కడకు వెళ్తున్నామని, వారు పట్టుకున్న తర్వాతనే మాకు నీరు వదులుతున్నారని పేర్కొన్నారు. మా బాధలు ఏ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా దళిత కాలనీలో తాగునీరు సరఫరా చేసేలా చూడాలని కోరారు.

పేదలకు అండగా ఉంటా..

తుగ్గలి, మే 16: కష్టాల్లో ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు అనారోగ్యానికి గురైన కుటుంబ యజమానులకు చనిపోయినా వారి కుటుంబాలకు తన వంతు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఇప్పటికే చాలా కుటుంబాలకు రూ.10వేలు అందించానని భవిష్యత్తులో కూడా పేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

వేరుశనగ విత్తనాల మంజూరు

తుగ్గలి, మే 16: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరు శనగ పంటకు విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 2,600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని, ఈ నెల 25న మండలానికి వస్తాయని అన్నారు. ప్రతి గ్రామంలోని ఆర్‌బీకే సెంటరులో విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి రైతు వారి పాస్‌బుక్‌లు, ఆర్‌బీకేలకు తీసుకెళ్లి సబ్సిడీ పోగా .. మిగిలిన మొత్తాన్ని చెల్లించి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

చంద్రబాబు సీఎం కావడం తథ్యం

ఆలూరు రూరల్, మే 16: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని, మళ్లీ చంద్రబాబు నాయుడు సీఎం అవుతారని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటారుకొండ శీనప్ప. సర్పంచి మోహన్‌రాజ్. కురవ సంఘం సీనియర్ నాయకులు బెలగంటి హనుమప్ప అన్నారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు. టీడీపీ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

పింఛన్ కోసం ఎదురు చూసి వృద్ధుడు మృతి

వెల్దుర్తి, మే, 16 : మండలంలో రామళ్లకోట గ్రామానికి చెందిన దుర్గి శాంతయ్య పింఛన్ కోసం ఎదురుచూపులు చూసి గురువారం తనువు చాలించారు. ఒకే కార్డు పై దుర్గి శాంతయ్య, అతని కూతురుకు రెండు పింఛన్లు అందుతున్నాయని దుర్గి శాంతయ్య పింఛన్ నిలుపుదల చేశారు. నిరుపేద వృద్ధుడిని ఆదుకునేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ముందుకు నెలకు కొంత ఆర్థిక సహాయం అందజేస్తూ నాటి నుండి నేటి వరకు అండగా నిలబడ్డారు.

హనుమాపురంలో జాతీయ డెంగీ దినోత్సవం

పెద్దకడుబూరు, మే 16: మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో వైద్యాధికారిని సుస్మిత ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తగా ఉండాలన్నారు.